తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం-23- ఫిబ్రవరి- 2026 | సంపుటి : 3 | సంచిక : 266 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




### ఒగ్గు కథ వైభవాన్ని ప్రపంచానికి చాటే "గాడ్స్ ఇన్ ది వాయిస్" టీజర్ ఆవిష్కరణ

- తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఘనంగా ప్రారంభం
- తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే కల్చర్ ఫిల్మ్‌గా రూపుదిద్దుకుంటున్న డాక్యుమెంటరీ
- దర్శకుడు డాక్టర్ జి. కుమారస్వామి, మూవీ టీమ్‌కు అభినందనలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ జాగృతి కార్యాలయంలో డాక్టర్ జి. కుమారస్వామి దర్శకత్వంలో రూపొందుతున్న "గాడ్స్ ఇన్ ది వాయిస్" డాక్యుమెంటరీ కల్చర్ ఫిల్మ్ టీజర్‌ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. తెలంగాణ సాంప్రదాయ కళారూపమైన ఒగ్గు కథను ప్రపంచ వేదికపై ప్రతిష్ఠాత్మకంగా నిలబెట్టే ప్రయత్నంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కల్వకుంట్ల కవిత, తెలంగాణ ఆత్మను, సంప్రదాయాలను, ఆధ్యాత్మిక మూలాలను ప్రతిబింబించేలా ఈ డాక్యుమెంటరీ రూపొందించబడిందని తెలిపారు. ఒగ్గు కథ వంటి పౌరాణికజానపద కళారూపం కేవలం వినోదం మాత్రమే కాదని, అది తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని అన్నారు. అలాంటి కళారూపాన్ని ఆధునిక మాధ్యమం ద్వారా ప్రపంచానికి చాటే ప్రయత్నం ప్రశంసనీయం అని అభిప్రాయపడ్డారు.

మిగతా 2లో..



# నీటి హక్కులో రాజీలేదు

## గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చిస్తాం

## తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీ లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం

## దేవాదుల ఎత్తిపోతల పథకంపై స్థల పరిశీలన, సమగ్ర సమీక్ష

## రెండేళ్లలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి లక్ష్యం

**ములుగు, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):**

గోదావరి నదీ జలాల వినియోగం, వాటిపై తలెత్తిన వివాదాలు, ప్రాజెక్టుల నిర్మాణం వంటి అన్ని అంశాలపై శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో సమగ్రంగా ఒకరోజు చర్చ నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుతామని పునరుద్ఘాటించారు. నీటి హక్కుల విషయంలో అనవసర గందరగోళం సృష్టించవద్దని సూచించారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌ను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. ఇంజనీర్లతో మాట్లాడి ప్రాజెక్టు పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. దేవాదుల ఇంటేక్ పాయింట్ వద్ద మోటార్లను



పరిశీలించిన అనంతరం మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయడానికి నిధుల సమీకరణపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలిపారు.

నీటి వివాదాల విషయంలో మొదట రెండు రాష్ట్రాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని, అవసరమైతే కేంద్ర ప్రభుత్వం, నదీ పరిపాలన బోర్డులు, ట్రిబ్యునల్లు, సుప్రీంకోర్టు వరకు వెళ్లేందుకు సిద్ధమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నికర, మిగులు, వరద జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకుంటామని తెలిపారు. గత పదేళ్లలో ప్రాజెక్టుల నిర్లక్ష్యం వల్ల నష్టపోయామని, ఇకపై అలాంటి పరిస్థితి రానివ్వబోమని అన్నారు. రాష్ట్రంపై అప్పుల భారం ఉన్నప్పటికీ వచ్చే రెండేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు తెలంగాణ ప్రజల ఆస్తి అని, వాటిని పునరుద్ధరించి ప్రజలకు ఉపయోగపడేలా చేస్తామని చెప్పారు. గోదావరి ప్రాజెక్టులను పూర్తి చేసి ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ సంకల్పమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# రామచందర్ రావు అరెస్ట్

## అప్రజాస్వామికం: ఈటెల రాజేందర్

- సంఘీభావం తెలపడం నేరమా? అని ప్రశ్న
- హౌస్ అరెస్టులపై తీవ్ర ఖండన
- ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపణ



**హైదరాబాద్, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):**

కామారెడ్డికి వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావును అరెస్ట్ చేయడం అప్రజాస్వామిక చర్య అని ఎంపీ ఈటెల రాజేందర్ మండిపడ్డారు. సొంత పార్టీ ఎమ్మెల్యేకు సంఘీభావం తెలపడానికి వెళ్లడమే నేరమా అని ప్రశ్నించారు. హౌస్ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఇలాంటి చర్యలతో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసిన పాలనను ప్రజలు ఎలా తిప్పికొట్టారో గుర్తుచేశారు. అదే విధానాలను ఇప్పుడు ప్రభుత్వం అనుసరిస్తోందని విమర్శించారు. అధికార పార్టీ నేతలు గుండాయిజానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే దాడులను ప్రోత్సహిస్తోందని అన్నారు.

మిగతా 2లో..

# మొయినాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలి

## మంత్రి పొన్నం ప్రభాకర్..

- ఎమ్మెల్యే కాలే యాదయ్య సమక్షంలో నూతన పాలకవర్గం మర్యాదపూర్వక భేటీ
- చైర్మన్ సోనియా దర్శన్, వైస్ చైర్మన్ రాజ్ ముదిరాజ్‌కు అభినందనలు
- ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలనే దిశానిర్దేశం



**చేవెళ్ల, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):**

మొయినాబాద్ మున్సిపాలిటీ నూతన పాలకవర్గం ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మొయినాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంతో నూతన పాలకవర్గానికి మంత్రి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ సోనియా దర్శన్, వైస్ చైర్మన్ రాజ్ ముదిరాజ్‌లను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదంతో మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు పదవిని అధికారంగా కాకుండా బాధ్యతగా భావించాలని మంత్రి హితవు పలికారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడం ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. మొయినాబాద్ మున్సిపాలిటీని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు సమన్వయంతో పనిచేయాలని నూతన పాలకవర్గానికి మంత్రి దిశానిర్దేశం చేశారు.

# కుమ్మెర ఘటనపై తీన్మార్ మల్లన్న ఆగ్రహం

- బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటింపు
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు రాజీనామా చేయాలని డిమాండ్
- న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరిక

2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పట్టణాభివృద్ధికి కట్టుబడి పనిచేయాలి

- మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిసిన సత్తుపల్లి, కల్లూరు ప్రజాప్రతినిధులు
- నూతన మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు అభినందనలు
- ఖమ్మం క్యాంపు కార్యాలయంలో భేటీ



**ఖమ్మం, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** నూతనంగా ఎన్నికైన సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆదివారం ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారికి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ప్రజలు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని, పట్టణాల అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలని మంత్రి సూచించారు. మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలను సమయానికి పరిష్కరించి విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే పట్టణాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని మంత్రి తెలిపారు. ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలను సమర్థంగా అమలు చేసి ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.


# కుమ్మెర ఘటనపై తీన్మార్ మల్లన్న ఆగ్రహం



**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో కుమ్మెర మల్లన్న స్వామి జాతర సందర్భంగా రజక సోదరులపై జరిగిన దాడిలో ఓ పసికందు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికార పార్టీ నేతలు స్పందించకపోవడం, బాధిత కుటుంబానికి న్యాయం చేయడంలో విఫలమవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రజల ముందుకు వచ్చి సమాధానం చెప్పాలని, అవసరమైతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణ భద్రతను కాపాడలేని నాయకత్వానికి పదవుల్లో ఉండే హక్కు లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన తీన్మార్ మల్లన్న, పార్టీ తరపున రూ.2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఇది తక్షణ ఉపశమనం మాత్రమేనని, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. చిన్నారి మృతితో ఏర్పడిన లోటు ఎప్పటికీ నిండదని, కానీ న్యాయం జరిగే వరకు పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బాధితులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆయన, నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు విధానంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ డీఎస్పీతో వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. అనంతరం కాలినడకన కుమ్మెర గ్రామానికి వెళ్లి చిన్నారి సమాధి వద్ద నివాళులు అర్పించారు. నిందితులు తాళాలు వేసి పరారైనట్లు పేర్కొంటూ, ఎక్కడ ఉన్నా చట్టం ముందు నిలబెట్టే వరకు వెనక్కి తగ్గబోమని హెచ్చరించారు. కులం పేరుతో జరుగుతున్న దాడులు ఆగాలని, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జనసేనలో భారీ చేరికలు

- ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి పలువురు నాయకులు పార్టీ కండువాలు ధరింపు
- తెలంగాణ జనసేన ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ సమక్షంలో కార్యక్రమం
- పవన్ కళ్యాణ్ ఆశయాలతో ముందుకు సాగుతామని ప్రతిజ్ఞ




**హైదరాబాద్, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** కూకట్పల్లి జనసేన పార్టీ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఘనంగా జనసేన పార్టీలో చేరారు. తెలంగాణ జనసేన పార్టీ ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ చేతుల మీదుగా గుండెల విజయకుమార్, కె. శ్రీను, ఏ. మహేష్, సి. నరేష్, ఎం. శ్రీనివాస్, వై. లక్ష్మి, వై. మల్లేష్, గుండెల పావని, ఆర్. ఆండాలు, బి. బాలమ్మ తదితరులు పార్టీ కండువాలు ధరించి సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా చేరికల నేతలు మాట్లాడుతూ జనసేన అధినేత, ఆంధ్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం, పారదర్శక రాజకీయాల కోసం జనసేనతో కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు మండపాక కావ్య, యువ నాయకుడు యడమ రాజేష్, నగర స్థానిక సంస్థల తాత్కాలిక కమిటీ సభ్యుడు మహేష్, రత్న సాయి తదితరులు పాల్గొన్నారు. జనసైనికుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.





# బుద్ధవనం సందర్శించిన సౌత్ కొరియా ప్రతినిధులు

**నాగార్జునసాగర్, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** అంతర్జాతీయ ప్రమాణాలతో నాగార్జునసాగర్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బుద్ధవనాన్ని ఆదివారమునాడు సౌత్ కొరియా బుద్ధిష్ట్ స్టడీస్ నేషనల్ యూనివర్సిటీ కి సంబంధించిన ప్రతినిధులు సందర్శించారు. హైదరాబాదులో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న వీరు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సూచన మేరకు ఆదివారం బుద్ధవనాన్ని సందర్శించారు. సౌత్ కొరియా నేషనల్ యూనివర్సిటీ కి చెందిన విద్యా సాంస్కృతిక ప్రతినిధుల బృందం కాంగ్ సుంగ్ యెాంగ్,చోయ్ సేంగహో, మిన్ క్యేయోంగ్ వూ, కవన్ జిన్ వోక్, శేషు, చిరాగ్ జలది తదితరుల బుద్ధవనం సందర్శనలో భాగంగా బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించిన అనంతరం బుద్ధ చరిత వనం, జాతకవనం, ధ్యాన వనం, స్థూప స్థూపవనాలను సందర్శించారు. స్థూప వనములో నిర్మించినటువంటి సౌత్ కొరియా మహాస్తూపాన్ని సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మహా స్తూపం అంతర్భాగంలోని సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను తెలిపే లఘు చిత్రాన్ని వీక్షించారు. మహాస్తూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవి చంద్ర,బుద్ధవనం ఆర్ట్స్ అండ్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందర్రావులు వీరిచే బుద్ధ జ్యోతులను వెలిగించి అనంతరం బుద్ధవనం కండువాలతో,బ్రోచర్లతో సత్కరించారు. బుద్ధ వనములో చేపట్టబోయే నూతన నిర్మాణాల గురించి వారికి తెలియజేశారు. వీరితోపాటు స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## ఒగ్గు కథ వైభవాన్ని ప్రపంచానికి చాటే “గాడ్స్ ఇన్ ది వాయిస్” టీజర్ ఆవిష్కరణ




(మొదటి పేజీ తరువాయి)

డాక్టర్ జి. కుమారస్వామి ఈ ప్రాజెక్టును అత్యంత అంకితభావంతో రూపొందిస్తున్నారని, తెలంగాణ సంస్కృతి పరిరక్షణకు ఇది ఒక ముఖ్యమైన అడుగు అని పేర్కొన్నారు. డాక్యుమెంటరీని అద్భుతంగా తెరకెక్కిస్తున్న దర్శకుడితో పాటు మూవీ టీమ్ మొత్తాన్ని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రతినిధులు, కళారంగ ప్రముఖులు, సాంస్కృతిక కార్యకర్తలు పాల్గొన్నారు. “గాడ్స్ ఇన్ ది వాయిస్” డాక్యుమెంటరీ తెలంగాణ జానపద సంపదను అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేసే మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తమైంది.

## రామచందర్ రావు అరెస్ట్
## అప్రజాస్వామికం: ఈటెల రాజేందర్



(మొదటి పేజీ తరువాయి)


సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న బీజేపీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులను హౌస్ అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజలు తగిన సమయంలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వం తన చర్యలపై పునరాలోచించాలని ఈటెల రాజేందర్ సూచించారు.

# వార్డుల్లో తిరగండి.. సమస్యలు తీర్చండి



- మంత్రి పొంగులేటి కౌన్సిలర్లకు గట్టి హెచ్చరిక
- వారానికి ఐదు రోజులు ప్రజల్లో ఉండాలనే ఆదేశం
- ఏదులాపురాన్ని రాష్ట్రంలోనే రోల్ మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని స్పష్టం
- నూతన చైర్‌పర్సన్ అనిత బాధ్యతల స్వీకారం

**ఖమ్మం, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఎన్నికల వరకే రాజకీయాలు పరిమితమని, గెలిచిన తర్వాత ప్రజాసేవే లక్ష్యంగా పని చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు స్పష్టం చేశారు. ఆదివారం పెద్దతండాలోని మున్సిపల్ కార్యాలయంలో ఏదులాపురం నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత బాధ్యతల స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కౌన్సిలర్లకు కఠిన దిశానిర్దేశం చేశారు. ప్రతి కౌన్సిలర్ వారానికి ఐదు రోజులు, రోజుకు కనీసం రెండు గంటలు తమ వార్డుల్లో పర్యటించాలని ఆదేశించారు. కేవలం కుర్చీలకే పరిమితం కాకుండా ప్రజల మధ్య ఉండాలని సూచించారు. “ప్రతి పనికి నిధులు అవసరం లేదు. మీరు బాధ్యతగా తిరిగితేనే అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగుపడుతుంది” అని వ్యాఖ్యానించారు. ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి ప్రకటించారు. తాగునీటి సమస్యలు, మురికినీటి నిల్వ, నాలాల కబ్జాలు వంటి అంశాలపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పదిహేను రోజుల్లో మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, అప్పటికి ప్రతి వార్డు సమస్యపై కౌన్సిలర్లు పూర్తి అవగాహనతో ఉండాలని హెచ్చరించారు. అనంతరం సత్యనారాయణపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుడి గృహ ప్రవేశ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# వార్డుల్లో తిరగండి.. సమస్యలు తీర్చండి!

- వారంలో ఐదు రోజులు.. రోజుకు రెండు గంటలు ప్రజల్లో ఉండాల్సిందే
- ఏదులాపురాన్ని రాష్ట్రంలోనే 'రోల్ మోడల్'గా తీర్చిదిద్దుతాం
- కౌన్సిలర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దిశానిర్దేశం
- మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అనిత బాధ్యతలు స్వీకరణ

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 22(తెలంగాణ ముచ్చట్లు)

"ఎన్నికల వరకే రాజకీయం.. గెలిచిన తర్వాత ఏ పార్టీ వారైనా ప్రజా ప్రభుత్వం తరపున పేదవాడికి సేవ చేయాల్సిందే. పదవి అనేది అధికారం కాదు, బాధ్యత అని గుర్తించాలి" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పెద్దతండాలోని మున్సిపల్ కార్యాలయంలో ఏదులాపురం నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత బాధ్యతల స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



**ఫీల్డ్ లో ఉంటేనే వ్యవస్థ బాగుపడుతుంది**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి నూతన ప్రజాప్రతినిధులకు తనదైన శైలిలో దిశానిర్దేశం చేశారు. ప్రజలు నమ్మి ఓటేశారని, కేవలం కుర్చీలకే పరిమితం కాకుండా నిత్యం క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. "ప్రతి కౌన్సిలర్ వారంలో ఐదు రోజులు, ఉదయం పూట రెండు గంటలు తప్పనిసరిగా వార్డుల్లో పర్యటించాలి. ప్రతి పనికి నిధులు అవసరం లేదు, మీరు బాధ్యతగా తిరిగితేనే అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగుపడుతుంది" అని ఆదేశాలు జారీ చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని, తాగునీటి సమస్యలు, మురికినీరు నిలవకుండా చూడటం, నాలాల కబ్జాలను అడ్డుకోవడంపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 15 రోజుల్లో మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, అప్పటికి ప్రతి వార్డు సమస్యపై కౌన్సిలర్లకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు.



**ఇందిరమ్మ ఇంటి వేడుకలో ఆత్మీయత**

అనంతరం సత్యనారాయణపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుడి గృహ ప్రవేశ వేడుకకు మంత్రి హాజరయ్యారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపి, ఆత్మీయంగా పట్టు వస్త్రాలను కానుకగా అందించారు. పేదల సంక్షేమమే ఈ ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్ , కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రామచంద్రపురంలో సాగునీటి పనులకు శ్రీకారం.!

- సీతారామ ప్రాజెక్ట్ ప్యాకేజీ-6 కాలువకు భూమిపూజ.

సత్తుపల్లి, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):





సత్తుపల్లి నియోజకవర్గం పెనుబల్లి మండలం రామచంద్రపురం గ్రామంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ-6 కాలువ పనులకు ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కాలువ పనులు పూర్తయితే రామచంద్రపురం సహా పరిసర ప్రాంతాల రైతుల సాగునీటి సమస్యలు తొలగిపోతాయని పేర్కొన్నారు. పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో రామచంద్రపురం సర్పంచ్ రిజ్వాన కరిముల్లా, పెనుబల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, ఎంఆర్వో, ఎంపీడీఓలు పాల్గొన్నారు. నీటిపారుదల శాఖ ఎస్ఈ, ఈఈ, డీఈ, జేఈ అధికారులు, కేఎన్ఆర్ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. మండల నాయకులు, రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాగునీటి వసతి కల్పిస్తున్నందుకు రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు

# కీసరలో ఘనంగా 211వ వారం జ్ఞానమాల కార్యక్రమం

- ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యమకారుడు వనందాస్ లక్ష్మీనారాయణ గౌడ్ హాజరు

కీసర, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):



మేడ్చల్ జిల్లా కీసర మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో 211వ వారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారుడు, జాతీయ గౌడ సంఘం నాయకులు, మాజీ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వనందాస్ లక్ష్మీనారాయణ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమ ప్రారంభంలో మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రె గణేష్, ప్రధాన కార్యదర్శి మంచాల సంజీవ్ మరియు కమిటీ సభ్యులు కలిసి ముఖ్య అతిథికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. సభలో మాట్లాడుతూ వనందాస్ లక్ష్మీనారాయణ గౌడ్ పేర్కొంటూ, ఉద్యమం ద్వారానే హక్కులు సాధ్యమవుతాయని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన 14 ఏళ్ల పోరాటం ప్రజలకు స్ఫూర్తినిచ్చిందన్నారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించి సత్కరించడం గర్వకారణమని తెలిపారు. కీసర మండలం ఉద్యమాలకు పురిటిగడ్డగా నిలిచిందని, ఇక్కడ ప్రారంభమైన ప్రతి ఉద్యమం లక్ష్యాన్ని సాధించిందని పేర్కొన్నారు. జ్ఞానమాల కార్యక్రమం ద్వారా యువతలో చైతన్యం పెంపొందించి, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించాలన్నారు. రాజకీయ పార్టీల జెండాల కింద పనిచేస్తూనే యువత నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సంఘ ప్రతినిధులు, యువత మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. సభ అనంతరం జ్ఞానమాల కార్యక్రమాన్ని కొనసాగిస్తూ సామాజిక అంశాలపై చర్చలు నిర్వహించారు.



# కీసరలో అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమం

**రాజ్యాంగ ఫలాలు అందరికీ అందేలా చూడడమే నిజమైన నివాళి: డా. డి.బి. జ్యోతి**

కీసర, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):



నవభారత రాజ్యాంగ నిర్మాత బి. ఆర్. అంబేద్కర్ దేశంలోని అణగారిన వర్గాలకు ఆశా జ్యోతి అని, ఆయన ఆశయ సాధనకు కట్టుబడి పనిచేయాలని కె.జె.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపకురాలు, సామాజిక కార్యకర్త డా. డి.బి. జ్యోతి పిలుపునిచ్చారు. కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని ఆర్‌జీకే కాలనీలో ఆటో స్టాండ్ ప్రాంగణంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న “అంబేద్కర్ జ్ఞానమాల” కార్యక్రమంలో భాగంగా ఈ ఆదివారం జరిగిన 4వ జ్ఞానమాల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బి. ఆర్. అంబేద్కర్ మరియు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు జ్ఞానమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడిన ఆమె, నేడు ప్రజలు అనుభవిస్తున్న హక్కులు, అవకాశాలు అన్నీ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ఫలాలేనని తెలిపారు. ఆకలి, అసమానతలు లేని సమసమాజ స్థాపన కోసం ఆయన అహర్నిశలు కృషి చేసి సామాజిక న్యాయం సాధించారని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేతా రాజు ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ మంగళపూరి వెంకటేష్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు గొల్లూరి రాజు, ప్రధాన కార్యదర్శి వుల్లి సురేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు పులిపాక తిరుపతి, ఈగరాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరనున్న భావన గౌడ్

నాచారం, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ నియోజకవర్గం నాచారం ప్రాంతానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, సంఘసేవకురాలు భావన గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. సోమవారం నాచారంలో నిర్వహించనున్న ప్రత్యేక సమావేశంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆమె కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోనున్నారు. ఈ సందర్భంగా భావన గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ప్రజాపాలన విధానాలు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. సమాజానికి సేవ చేయడం తన ధ్యేయమని, కాంగ్రెస్ వేదికగా మరింత విస్తృతంగా ప్రజా సేవ చేసే అవకాశం లభిస్తుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తనతో పాటు అనుచరులు, అభిమానులు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా హాజరుకానున్నట్లు సమాచారం.






# మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిసిన సత్తుపల్లి, కల్లూరు మున్సిపల్ ప్రజాప్రతినిధులు

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు)

నూతనంగా ఎన్నికైన సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు ఆదివారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారికి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ప్రజలు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, పట్టణాల అభివృద్ధికి కట్టుబడి ఉండాలని ఈ సందర్భంగా మంత్రి వారికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



# కలకాలం కలిసి ఉండాలి...

- నవ జంటకు మంత్రి పొంగులేటి - మాధురి దంపతుల ఆశీస్సులు

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు)

సుగుణ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన వివాహ రిసెప్షన్ వేడుకకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఆయన సతీమణి మాధురి పాల్గొని నవ దంపతులను ఆశీర్వదించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వూకంటి గోపాల్ రావు వాణిశ్రీ దంపతుల కుమారుడు సుమంత్, ప్రతాపనేని బుచ్చిబాబు తనూజ దంపతుల కుమార్తె రేష్మితలపై అక్షింతలు వేసి.. "నూరేళ్లు చల్లగా, కలకాలం కలిసి ఉండాలి" అని దీవించారు.



# ట్రస్మా డివిజన్ బాధ్యులకు సత్కారం

సత్తుపల్లి, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):

జిల్లాలోని వివిధ డివిజన్లలో ఇటీవల ఏర్పాటైన ట్రస్మా నూతన కమిటీల బాధ్యులకు ఖమ్మంలోని వండర్ కిడ్స్ పాఠశాలలో సత్కారం నిర్వహించారు. తెలంగాణ స్కూల్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ (ట్రస్మా) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైరా, పాలేరు, కామేపల్లి, సత్తుపల్లి, మధిర, ఖమ్మం డివిజన్ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కాంతారావు, కార్యదర్శి నాయుడు వెంకటేశ్వరరావు, కోశాధికారి నాసరయ్యలతో పాటు జిల్లా, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు. విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని నూతన కమిటీలకు వారు సూచించారు.

# ఉప్పల్‌లో పెండింగ్ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

- ఎంఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన మందుముల పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):



ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఎ. రేవంత్ రెడ్డి, డి. శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఆయన మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో అనుమతుల కోసం ఎదురుచూస్తున్న పనులు, నిధుల కొరతతో నిలిచిపోయిన ప్రాజెక్టుల వివరాలను కమిషనర్‌కు వివరించారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలో చిలకనగర్ గణేష్ దేవాలయం వద్ద కల్వర్ట్ నిర్మాణం, సీతారామా కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, బీరప్పగడ్డలో గౌడ్స్ మరియు విశ్వకర్మ శ్మశానవాటికల అభివృద్ధి, రామంతాపూర్‌లో కమ్యూనిటీ హాల్ విస్తరణ, పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న సీసీ రోడ్ల పునర్నిర్మాణం చేపట్టాలని కోరారు.

అలాగే కాప్రా సర్కిల్‌లో వినాయక్ నగర్ ఫేజ్ II, ఎల్లారెడ్డిగూడా, శాలివాహన కాలనీ, నాగార్జున నగర్, వాసవి శివ నగర్ తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లు, బాక్స్ డ్రెయిన్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణం, ఓపెన్ జిమ్ & వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, కమ్యూనిటీ హాల్ (G+1) నిర్మాణం వంటి పనులకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

హెచ్‌బీ కాలనీ, మల్లాపూర్ డివిజన్లలో కూడా సీసీ రోడ్లు, ఆర్‌సీసీ పైప్‌లైన్, సీనియర్ సిటిజన్ భవనం, శ్మశానవాటిక అభివృద్ధి పనులు అత్యవసరమని తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపడేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరగా, వినతిపత్రాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కీసరగుట్టలో యాంకర్ సుమ స్వామి దర్శనం

- ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదం పొందిన కనకాల సుమ రాజీవ్
- తీర్థ ప్రసాదాలు అందజేసిన ఆలయ పూజారులు
- భక్తులతో సందడి

**కీసర, ఫిబ్రవరి 22(తెలంగాణ ముచ్చట్లు) :**

ప్రతిష్ఠాత్మక పుణ్యక్షేత్రమైన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ లో కీసరగుట్ట శ్రీ భవాని శివ దుర్గా సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం ప్రముఖ టీవీ యాంకర్ కనకాల సుమ రాజీవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నడుమ ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో సుమ గారు స్వామి వారికి ప్రత్యేక అర్చనలు చేశారు. ఆలయ పూజారులు రవి శర్మ, రమేశ్ శర్మ, ప్రణీత్ శర్మ వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వదించి, అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఈ కార్యక్రమం లో ఆలయ ఛైర్మన్ కుమారుడు తటాకం అభిలాష్ శర్మ పాల్గొన్నారు. యాంకర్ సుమ రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. భక్తులు ఆమెతో ఫోటోలు దిగుతూ ఆనందం వ్యక్తం చేశారు.పూజా కార్యక్రమం అనంతరం సుమ స్థానిక ప్రజలకు శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.



# షార్ట్ సరక్యూట్ తో ఇల్లు దగ్ధం

**హసన్ పర్తి,ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):**



హసన్ పర్తి మండలం జయగిరి గ్రామంలో ఆదివారం రోజున కరంట్ షార్ట్ సరక్యూట్ తో ఇల్లు దగ్ధం అయినట్లు గ్రామస్తులు తెలియజేశారు. గ్రామానికి చెందిన బొజ్జ రాధమ్మ భర్త యాదగిరి గత ఐదు సంవత్సరాల క్రితం చని పొగ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది.ఈ క్రమంలో ఆదివారం రోజున ఉదయం కూలి పనికి వెళ్లగా మధ్యాహ్నం 12 01గంటల సమయంలో షార్ట్ సరక్యూట్ అయి ఇల్లు,నిత్యావసరసరుకులు, బట్టలు, 20,000 నగదు కాలి పోయినట్లు తెలియజేశారు.ఇల్లు కాలిపోయి నిరాశ్రయరాలైన రాధమ్మను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

# కుమ్మెరలో కుల వివక్ష దాడి -నిందితుల అరెస్టుకు డిమాండ్

- నత్తి సుధాకర్ ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు

**వనపర్తి,ఫిబ్రవరి22(తెలంగాణ ముచ్చట్లు):**



నాగర్ కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామంలో చోటుచేసుకున్న కుల వివక్ష ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. రెండు నెలల పసికందుపై జరిగిన అమానుష దాడి నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర బి.సి., ఎస్.సి., ఎస్.టి. జె.ఏ.సి మరియు వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు నత్తి సుధాకర్ మహారాజ్ ఆదివారం ఒక ప్రకటనలో స్పందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటికీ కుల వివక్ష ఘటనలు చోటుచేసుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. భూస్వామ్య అగ్రకులానికి చెందిన వ్యక్తులు చాకలి కులానికి చెందిన వారు ప్రశ్నించడంతో మూకుమ్మడిగా దాడి చేసి గంటల తరబడి హింసకు పాల్పడటం దారుణమని విమర్శించారు. కులం పేరుతో అవమానాలు చేయడం, హింసకు దిగడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు.ఇటీవల జెండాలు పట్టుకొని శోభాయాత్రలు నిర్వహించిన వారు, ఇటువంటి ఘటనలపై నిరసనలకు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. బహుజన, దళిత, గిరిజన, మైనారిటీ యువత ధైర్యంగా ముందుకు వచ్చి అన్యాయాలపై గళమెత్తాలని పిలుపునిచ్చారు. కుల అహంకారంతో జరిగిన ఈ దాడిలో గాయపడిన కుటుంబాలకు తక్షణ న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.బాధితులకు అండగా నిలవాల్సిన రక్షణ వ్యవస్థ నిందితులకు వత్తాసు పలుకుతూ, బాధితులపై తప్పుడు కేసులు నమోదు చేయడం ఆందోళనకరమని పేర్కొన్నారు. సంబంధిత అధికారులను తక్షణమే సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి నిజాలను వెలికితీయాలని, ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు అప్రమత్తమై నిరసనలు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.




# "శతక్" మూవీని వీక్షించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

**మల్కాజిగిరి, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ప్రస్థానాన్ని ప్రతిబింబించే ఉద్దేశంతో రూపొందించిన "శతక్" చిత్రాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సికింద్రాబాద్ బోయగూడలోని సత్యా నెక్లెస్ ప్రైడ్‌లో వీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సంస్థ ఆవిర్భావం నుంచి దేశభక్తి, సేవా తత్వం, క్రమశిక్షణ, సాంస్కృతిక పరిరక్షణ వంటి విలువలతో ఎలా ముందుకు సాగిందో చిత్రంలో సమగ్రంగా చూపించారని తెలిపారు. స్వయంసేవకులు గ్రామాలు, పట్టణాలు తిరుగుతూ సమాజ చైతన్యాన్ని పెంపొందించిన తీరు, విపత్తుల సమయంలో ప్రజలకు అండగా నిలిచిన ఘటనలు, జాతీయ ఏకత్వాన్ని బలోపేతం చేసే కార్యక్రమాలు చిత్రంలో హృద్యంగా ప్రతిబింబించాయని పేర్కొన్నారు .ఈ చిత్రం కేవలం ఒక సంస్థ చరిత్రను మాత్రమే కాకుండా, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో సమాజం పాత్రను గుర్తుచేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశం కోసం త్యాగం, సమాజం కోసం సేవ అనే భావన ప్రతి యువకుడి హృదయంలో నాటే ప్రయత్నమే ఈ సినిమా అని అన్నారు.నేటి యువత ఆధునికత, సాంకేతికత మధ్య కూడా తమ మూలాలను మరవకుండా దేశాభివృద్ధిలో సక్రియంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమాజం ఐక్యంగా ఉన్నప్పుడు ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.





# పెద్దమందడి శిశుమందిర్ విద్యాలయానికి గుజ్జుల అశోక్ కుమార్ భూమి విరాళం

**పెద్దమందడి,ఫిబ్రవరి22(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి గ్రామం మరియు మండలం వాస్తవ్యులు, డిప్యూటీ తహసీల్దార్ పాన్ గల్ శ్రీ గుజ్జుల అశోక్ కుమార్ (కీ.శే గుజ్జుల పెంటయ్య కుమారుడు, రిటైర్డ్ వీఏఓ) విద్యాభివృద్ధి పట్ల తమ నిబద్ధతను చాటుతూ పెద్దమందడి శిశుమందిర్ విద్యాలయ నిర్మాణార్థం తమ సొంత భూమిలోని అర ఎకరం (20 గుంటలు) స్థలాన్ని విరాళంగా అందజేశారు.ఈ భూదానం కార్యక్రమం పాలమూరులోని బృందావన్ గార్డెన్ లో నిర్వహించిన శిశుమందిర్ సమ్మేళనం సందర్భంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శిశుమందిర్ ప్రతినిధులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గుజ్జుల అశోక్ కుమార్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన, విలువలతో కూడిన విద్య అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు.శిశుమందిర్ విద్యాలయాలు విద్యార్థుల్లో జ్ఞానం, సంస్కారం, దేశభక్తి వంటి విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలనే సంకల్పంతో ఈ భూమిని విరాళంగా అందజేసినట్లు వెల్లడించారు.శిశుమందిర్ నిర్వాహకులు ఆయన సేవా మనోభావాన్ని కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ స్థలంలో ఆధునిక సదుపాయాలతో విద్యాలయ భవనం నిర్మాణానికి త్వరలోనే చర్యలు ప్రారంభించనున్నట్లు తెలిపారు.గ్రామ ప్రజలు, ప్రముఖులు గుజ్జుల అశోక్ కుమార్ దాతృత్వాన్ని ప్రశంసిస్తూ వారికి హృదయపూర్వక శుభాభినందనలు తెలిపారు.






# ఈసీఐఎల్ ఎక్స్ రోడ్‌లో "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమం

**కుషాయిగూడ, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):**

రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా "అరైవ్ అలైవ్ క్యాంపెయిన్-2026" ఫేస్-2లో భాగంగా మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలో కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ ఎక్స్ రోడ్ వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ నిమ్మ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా లేన్ డిసిప్లిన్ పాటించాలని, అనవసర ఓవర్‌టేకింగ్ చేయకూడదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టం గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు.దాదాపు 50-60 మంది ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్ఐపి కే. సతీష్ మరియు ఇతర పోలీసు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలు మరియు మరణాలను తగ్గించే లక్ష్యంతో 22.02.2026 నుండి 28.02.2026 వరకు (ఏడు రోజుల పాటు) "అరైవ్ అలైవ్" రెండో దశ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలలో తెలంగాణ ఘనవిజయం

**వనపర్తి,ఫిబ్రవరి22(తెలంగాణ ముచ్చట్లు):**




న్యూఢిల్లీలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలులో తెలంగాణ హాకీ జట్టు మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఆదివారం గుజరాత్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 2-0 గోల్స్ ఆధిక్యంతో ఘనవిజయం సాధించింది.మ్యాచ్ ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన తెలంగాణ జట్టు ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించింది. జట్టు కెప్టెన్ మన్యం యాదవ్ ఒక గోల్ సాధించగా, సాయి సుందర్ మరో గోల్ చేసి జట్టు విజయానికి కీలక పాత్ర వహించారు. రక్షణ విభాగం కూడా సమన్వయంతో ఆడి గుజరాత్ జట్టుకు గోల్ అవకాశాలు ఇవ్వకుండా కట్టుదిట్టంగా ఆడింది. విజయం సాధించిన తెలంగాణ హాకీ జట్టును తెలంగాణ క్రీడాశాఖ కార్యదర్శి వంశీధర్ రెడ్డి, తెలంగాణ సచివాలయ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. జట్టు మేనేజర్ నరేష్ కుమార్, కోచ్ ఆనంద్ మరియు క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.రాబోయే మ్యాచ్‌లలో కూడా ఇదే ఉత్సాహంతో ఆడి తెలంగాణ రాష్ట్రానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

# నిశ్చితార్థ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**అడ్డాకల్,ఫిబ్రవరి22(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి నియోజకవర్గం అడ్డాకల్ మండలానికి చెందిన ఆంజనేయులు - లక్ష్మీ దంపతుల కుమార్తె ఉమా నిశ్చితార్థ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిశ్చితార్థం అనే తంతు జరిగిందంటే సగం పెళ్లి జరిగినట్లేనని పెద్దలు భావిస్తారని తెలిపారు.ప్రస్తుతం నిశ్చితార్థ వేడుకను కూడా పెళ్లి వేడుకతో సమానంగా ఘనంగా నిర్వహించడం శుభసూచకమని అన్నారు.ఇలాంటి శుభకార్యాలు కుటుంబ బంధాలను మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా నిశ్చితార్థ వేడుకను ఘనంగా నిర్వహించిన పెళ్లికూతురు తల్లిదండ్రులు ఆంజనేయులు, లక్ష్మీ దంపతులను ఎమ్మెల్యే అభినందించారు.కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.





# ఇందిరమ్మ గృహాలతో నిరుపేదల సొంతింటి కల సాకారం

**వనపర్తి,ఫిబ్రవరి22(తెలంగాణ ముచ్చట్లు):**

ఆర్థిక స్థోమత లేక సొంత గృహం నిర్మించుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదల సొంతింటి కలను ప్రభుత్వం ఇందిరమ్మ గృహాల ద్వారా సాకారం చేస్తోందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన నిరుపేదలకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో గృహాలు మంజూరు చేయడం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు.వనపర్తి నియోజకవర్గం అడ్డాకల్ మండల పరిధిలోని కన్మనూర్ గ్రామానికి చెందిన నంది మహేశ్వరి-నంది రమేష్, ఆస్కాన్ని సత్యమ్మ-కృష్ణయ్య, అస్కానీ లక్ష్మమ్మ-చంద్రయ్య కుటుంబాల నూతన గృహప్రవేశ కార్యక్రమాలకు వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి హాజరై వారికి నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, తమకు గృహం మంజూరు చేసి గృహప్రవేశానికి హాజరైన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం బలిద్‌పల్లి గ్రామానికి చెందిన కరుణ మన్యం గృహప్రవేశానికి హాజరై వస్త్రాలు అందజేశారు. అలాగే ఇందిరమ్మ దామోదర్ రెడ్డి కుటుంబ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వాదాలు అందించారు.కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక







## ఒక వధువు అంకితభావానికి నిలువుటద్దం

# చౌక్‌కీ మసీదు వారసత్వం

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 22(తెలంగాణ ముచ్చట్లు)**

హైదరాబాద్ పాతబస్తీలోని సందుగొందుల్లో, 19వ శతాబ్దపు మహబూబ్ చౌక్ క్లాక్ టవర్ గడియారపు టిక్‌టిక్ శబ్దాల మధ్య, ఒక నిశ్శబ్ద త్యాగాన్ని చాటిచెప్పే కట్టడం ఒకటి కొలువై ఉంది.

కుతుబ్ షాహీ రాజులు లేదా ఆసఫ్ జాహీ నిజాంల రాజ్యకాంక్షకు చిహ్నంగా నిలిచే భారీ కట్టడాల మధ్య, ఈ చౌక్ కీ మసీదు (జామా మసీదు చౌక్) ఒక అత్యంత వ్యక్తిగతమైన, పవిత్రమైన త్యాగానికి చిహ్నంగా నిలుస్తోంది.

1817లో నిర్మించబడిన ఈ మసీదు, ఏదో రాజశాసనం వల్లనో లేదా యుద్ధ విజయాల గుర్తుగానో పుట్టుకు రాలేదు. దీని పునాది రాళ్లు ఒక వివాహ ఒప్పందంలోని పవిత్రతతోనూ, సుగంధ పరిమళాలతోనూ పేర్చబడ్డాయి.

**'మెహర్' లోని పవిత్రత**

ఈ మసీదు యొక్క ఆత్మను అర్థం చేసుకోవాలంటే, ముందుగా 'మెహర్' అనే భావనను అర్థం చేసుకోవాలి. ఇస్లామిక్ సంప్రదాయం ప్రకారం, మెహర్ అంటే వివాహ సమయంలో వరుడు వధువుకు ఇచ్చే తప్పనిసరి బహుమతి (నగదు లేదా ఆస్తి రూపంలో). ఇది ఆమె వ్యక్తిగత భద్రతకు, గౌరవానికి చిహ్నం. దీనిపై ఆమెకు పూర్తి అధికారం ఉంటుంది.

వక్ఫ్ గెజిట్ రికార్డుల ప్రకారం, ఈ మసీదును ఖ్వాజా అబ్దుల్లా ఖాన్ నిర్మించారు. అయితే, దీని నిర్మాణానికి అవసరమైన నిధులు ఎక్కడివో తెలుసా? హజ్రత్ ఖ్వాజా నూరుల్లా రిఫాయి భార్య అయిన సయ్యదా ఉన్నీసా బేగం తన మెహర్ నిధి నుండి ఇచ్చారు.

**దైవానికి తిరిగి సమర్పించిన కానుక**

మహిళల చరిత్రలు తరచుగా వారి భర్తల పేర్లు మరియు హోదాల కింద మరుగున పడిపోయే కాలంలో, సయ్యదా ఉన్నీసా బేగం తీసుకున్న నిర్ణయం అత్యంత విప్లవాత్మకమైనది.

తన వ్యక్తిగత భద్రత కోసం లేదా అలంకరణ కోసం ఆ మెహర్ డబ్బును వాడుకోకుండా, దానిని సమాజ సేవకు, దైవ కార్యానికి మళ్లించాలని ఆమె నిశ్చయించుకున్నారు. తన స్త్రీధనాన్ని మసీదు నిర్మాణానికి ఇవ్వడం ద్వారా, ఆమె ఒక వ్యక్తిగత ప్రేమ కానుకను ప్రజా వారసత్వంగా మార్చారు. ఇస్లాంలో మహిళలకు ఉన్న హక్కులు మరియు సూఫీ తత్వంలోని నిస్వార్థ గుణం.. ఈ రెండింటి కలయికే ఈ మసీదు.

**బజార్‌లోని నిర్మాణ సౌందర్యం**

నిర్మాణ పరంగా చూస్తే, ఈ మసీదు 19వ శతాబ్దపు హైదరాబాద్ వాస్తుశిల్ప కళా పరివర్తనను ప్రతిబింబిస్తుంది.

దృఢమైన మినార్లు, అందమైన తోరణాలతో కూడిన ఈ కట్టడం రద్దీగా ఉండే 'చౌక్' ప్రాంతానికి ఒక ఆధ్యాత్మిక ప్రశాంతతను ఇస్తుంది. గుర్రపు బగ్గీలతో సాగే ప్రయాణాల నుండి నేటి డిజిటల్ మ్యాప్‌ల యుగం వరకు.. ఈ రెండు శతాబ్దాల ప్రయాణంలో నగరం ఎంతో మారినా, ఈ మసీదు మూలాలు మాత్రం అలాగే ఉన్నాయి.

**సజీవ వారసత్వం**

నేడు ముర్గి చౌక్ రొదల మధ్య మ్యుయెజిన్ ఇచ్చే 'అజాన్' వినిపిస్తుంటే, ఈ మసీదు తన ఉనికిని చాటుకుంటూనే ఉంది. గొప్ప కట్టడాలు ఎప్పుడూ రాజ్యాల మిగులు నిధులతోనే కాకుండా, వ్యక్తుల వ్యక్తిగత త్యాగాలతో కూడా నిర్మించబడతాయని ఇది నిరూపిస్తోంది.

చౌక్ కీ మసీదు కేవలం ప్రార్థనా స్థలం మాత్రమే కాదు; అది 200 ఏళ్ల కిందటి ఒక మహిళా భక్తికి సజీవ నిదర్శనం. చరిత్ర కేవలం కత్తులు పట్టిన వీరుల చేతనే కాకుండా, తమ మెహర్ లాంటి అత్యంత ప్రియమైన దానిని దైవానికి అర్పించే త్యాగమూర్తుల చేత కూడా రాయబడుతుందని ఇది చాటిచెబుతోంది.

**–ముహమ్మద్ ముజాహిద్**

## తుది ఘట్టం!

ప్రపంచమంతా
గాలిమారింది!
రణగొణధ్వనులు
ప్రపంచీకరణ!

కార్పొరేట్ భూతం
మార్కెట్ల వేటలో
చిన్నదేశాలను
మింగేస్తోంది!

సుంకాలతో
కబళిస్తోంది!
నోరెత్తితే
తుపాకీ తీస్తోంది!

వేటాడే భూతాలు
ప్రపంచమంతా
అమానుషత్వం
పేదలరోదనలు!

ఏ దేశచరిత్ర చూడు
జాతీయనాయకత్వం
కులమతమౌఢ్యాలతో
ప్రజల్నిపీక్కతింది!

పాముకళ్ళుకనపడక
తనపిల్లల్ని తినేసింది!
వీళ్లుతమసుఖాలకోసం
ప్రజల్నినిర్వీర్యంచేసారు!

చదువులొద్దన్నారు
వర్ణవిభజనతో
అస్పృస్యుల్ని చేసారు!
విభజించి పాలించారు!

విదేశీయుల్ని
అనుకోవటం ఎందుకు?
స్వదేశం ఏం చేసింది?
వెనక్కితిరిగి చూసుకో!

ఏ రాయి ఐతేనేం!
బుర్రబద్దలుకొట్టటంలో
స్వదేశీ 'మను' రాయి
'మతం'తో కొట్టింది!

ఏమీ తెలియనట్టు
నాటకాలాడొద్దు!
ఇది స్వదేశీ విదేశీ
పీడనలపరంపర!

ఈ దుష్ట పీడనల
తుదిఘట్టమే
ప్రపంచాన్నికుదిపేస్తున్న
నేటి సామ్రాజ్యవాదం!

చరిత్రంతా
వర్గపోరాటాలే!
మార్క్స్ చెప్పిన
మహత్తర సత్యం!

ఇది 'తుది ఘట్టం'
సామ్రాజ్యవాదం
నశిస్తుంది!
ప్రజలు జయిస్తారు!

**-తమ్మినేని అక్కిరాజు**
**హైదరాబాద్**

## మట్టికాగితంపై రాసిన కవితలు...



నాన్న సృజనకారుడే
కాని అతని కలం
చేతిలో పట్టుకునే పదం కాదు.

అతని కాగితం
భూమి.
అక్షరాలు
విత్తనాలు.

మట్టికాగితంపై
అతను రాసినవి
పదాలు కాదు
పంటలుగా పండిన కావ్యాలు.

అతని చెమట
శిరోరేఖ కాదు
భూమికి వేసిన
ప్రాణగీతం.

పుస్తకాలలో అతని పేరు లేదు,
పురస్కారాల పలకల్లో అతని ముఖం లేదు,
కానీ
మా జీవితం మొత్తం
అతని సాహిత్యమే.

నాన్న రాసిన కవితలు
చదవడానికి కాదు
బతకడానికి.



**–బసడ సంపత్ యాదవ్**






# నాగర్ కర్నూల్ ఘటనపై రజక సంఘం ఆగ్రహం

◆ **న్యాయం వరకు పోరాటం కొనసాగింపు**

**హన్మకొండ,ఫిబ్రవరి22(తెలంగాణ ముచ్చట్లు):**

నాగర్ కర్నూల్లో రజక కుటుంబంపై జరిగిన దాడిని ఉమ్మడి వరంగల్ జిల్లా రజక సంఘం తీవ్రంగా ఖండించింది. ఇటువంటి ఘటనలు సమాజంలో అసహనాన్ని పెంచే చర్యలని పేర్కొంటూ, దోషులను వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్షలు విధించాలని సంఘం డిమాండ్ చేసింది.ఈ నేపథ్యంలో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో అన్ని బీసీ సంఘాలను ఐక్యం చేస్తూ వరంగల్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వివిధ బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. మౌనిక కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం ఆగదని సంఘ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ విషయంలో బసవరాజు సారయ్య జిల్లా యంత్రాంగం, పోలీసు అధికారులతో మాట్లాడి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరిన విషయాన్ని సంఘం స్వాగతించింది. అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని పేర్కొన్నారు.

అలాగే ప్రముఖ ప్రజావక్తలు తీన్మార్ మల్లన్న, శారదన్ మహారాజు నాగర్ కర్నూల్ చేరుకుని సంఘీభావం ప్రకటించడం అభినందనీయమని తెలిపారు. రజక సమాజ గౌరవం, బీసీ ఐక్యత కోసం అందరూ ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని ఉమ్మడి వరంగల్ జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి చిట్యాల బిక్షపతి వెల్లడించారు.

# రజక కుటుంబంపై దాడి చేసిన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలి

◆ **బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్**

**నాగర్ కర్నూల్, ఫిబ్రవరి22(తెలంగాణముచ్చట్లు):**



నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని ఓ గ్రామంలో రజక కుటుంబం పై అగ్రకులస్తుల దాడిలో చిన్నారి మృతి చెందిన ఘటన సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రపంచ దేశాలను పిలిచి కృత్రిమ మేధ సాంకేతికత అభివృద్ధి కోసం సంబరాలు జరుపుకుంటున్న వేళ, దేశంలో కులం పేరుతో దాడులు జరగడం రాతియుగాన్ని తలపిస్తోందని సురేష్ పేర్కొన్నారు. నాగరిక సమాజానికి తగని ఈ చర్యలపై కఠినంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి ప్రత్యేక నష్టపరిహారం ప్రకటించాలని ఆయన కోరారు. నిందితులపై నమోదైన కేసుల వివరాలు, పోలీసులు తీసుకుంటున్న చర్యలను అధికారికంగా పాత్రికేయ సమావేశంలో వెల్లడించాలని డిమాండ్ చేశారు. అలాగే కుమ్మెర గ్రామంలోని ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, నాగర్ కర్నూల్ ఎంపీ, ఎమ్మెల్యేలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి భరోసా ఇవ్వాలని బోరెల్లి సురేష్ కోరారు.

# పెద్ద బండ లాగుడు పోటీలతో రాజోలి జాతర సందడి

**రాజోలి,ఫిబ్రవరి22(తెలంగాణ ముచ్చట్లు):**

రాజోలి మండల కేంద్రంలో వెలసిన శ్రీ అడివేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా నిర్వహించిన పెద్ద బండ లాగుడు పోటీలు గ్రామంలో ఉత్సాహాన్ని రెట్టింపు చేశాయి. ప్రతి సంవత్సరం తిరునాళ్లలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.ఈ ఏడాది కూడా ఇతర రాష్ట్రాల నుంచి బండలాగుడు పోటీల్లో ప్రావీణ్యం సాధించిన బృందాలు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాయి. బండలను లాగుతూ చూపిన శక్తి, సమన్వయం, నైపుణ్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. పోటీల ద్వారా రాజోలి జాతర ఖ్యాతి ఇతర ప్రాంతాలకు చేరుతోందని గ్రామ పెద్దలు తెలిపారు.జాతర సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ చింపుల గంగిరెడ్డి, ఉప సర్పంచ్ సంధ్య శ్రీరామ్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ రెడ్డి, యువ నాయకుడు రాజ్ కిరణ్ రెడ్డి, పులిపాటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.







# భారత్–అమెరికా వాణిజ్య ఒప్పంద చర్చలు వాయిదా

న్యూఢిల్లీ - ఫిబ్రవరి 22 - (తెలంగాణ ముచ్చట్లు): భారత్ మరియు అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి చట్టబద్ధ తుది రూపు ఇవ్వడానికి జరగాల్సిన కీలక చర్చలు వాయిదా పడ్డాయి. సోమవారం నుంచి వాషింగ్టన్ నగరంలో మూడు రోజుల పాటు ఇరు దేశాల ప్రతినిధులు సమావేశం కావాల్సి ఉండగా, తాజా పరిణామాల కారణంగా ఈ సమావేశాలను మరో తేదీకి మార్చినట్లు జాతీయ మాధ్యమాలు వెల్లడించాయి.

ప్రపంచ దేశాలపై అమెరికా ప్రభుత్వం విధించిన సుంకాల అంశంపై ఇటీవల అమెరికా అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ప్రభావంతో వాణిజ్య చర్చల సమయాన్ని మార్చాల్సి వచ్చినట్లు సమాచారం. ఇరు దేశాలకు అనుకూలమైన తేదీల్లో చర్చలను మళ్లీ నిర్వహించనున్నట్లు విదేశాంగ వర్గాలు పేర్కొన్నాయి. అయితే దీనిపై కేంద్ర ప్రభుత్వం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు.

గతంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక దేశాలపై భారీ సుంకాలు విధించిన విషయం తెలిసిందే. భారత్‌పై కూడా 50 శాతం సుంకాలు అమలులోకి వచ్చాయి. అనంతరం మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరిన తర్వాత అవి 18 శాతానికి తగ్గాయి. అమెరికా అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెలువడిన తర్వాత ఆ సుంకాలు 10 శాతానికి చేరినట్లు సమాచారం.

అయితే ఆ తీర్పుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ట్రంప్, కొద్ది గంటల వ్యవధిలోనే ప్రపంచ దేశాలపై సుంకాలను 15 శాతానికి పెంచినట్లు వార్తలు వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి తుది రూపు దాల్చే ప్రక్రియ కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉందని ఆర్థిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# మల్లాపూర్‌లో భవానీ నగర్ ఓపెన్ నాళా సమస్యకు శాశ్వత పరిష్కారం

**మల్లాపూర్, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్‌లోని భవానీ నగర్ కాలనీలో చాలాకాలంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఓపెన్ నాళా బాక్స్ డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. కాలనీలో ఓపెన్‌గా ఉన్న డ్రైనేజ్ కారణంగా దుర్వాసన, దోమల వ్యాప్తి, అనారోగ్య సమస్యలు నెలకొనడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీ వాసుల ఫిర్యాదుల మేరకు సమస్యను గుర్తించిన కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు తీసుకునేలా కృషి చేశారు. నాచారం సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం ఈఈ రమేష్, మల్లాపూర్ డివిజన్ ఇంజినీరింగ్ విభాగం ఏఈ సూరజ్ ఆధ్వర్యంలో మరమ్మత్తు పనులు వేగంగా ప్రారంభమయ్యాయి.డ్రైనేజ్‌ను బాక్స్ పద్ధతిలో బలపరిచి, భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం, భద్రతే తమ ప్రథమ లక్ష్యమని, ఇలాంటి సమస్యలపై ఇకముందు కూడా తక్షణ స్పందనతో పరిష్కారం చూపిస్తామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని పేర్కొన్నారు.సమస్య పరిష్కారానికి సహకరించిన అధికారులకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.





# భవ్యంగా శ్రీ శైవ క్షేత్ర వనిత శక్తి ఇంటర్నేషనల్ ఆధ్యాత్మిక మహోత్సవం

**ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొన్నారు**

**మేడ్చల్ మల్కాజిగిరి, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):**

శ్రీ శైవ క్షేత్ర వనిత శక్తి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పార్థివ్ "ధర్మ రక్షతి రక్షితః" ట్రస్ట్ నిర్వహించిన వనితా శంఖారావం ఆధ్యాత్మిక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమం సందర్భంగా హోమాలు, దీపప్రజ్వలన, భాగవద్గీత పారాయణం, శ్రీ శివ-పార్వతీ మరియు శ్రీ రామ-ఆంజనేయ స్వామి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శక్తి స్ఫూర్తిని ప్రతిబింబించేలా 40 దిక్కులలో ప్రత్యేక ఆరాధనలు చేపట్టడం విశేషంగా నిలిచింది. వేలాది మంది మహిళలు, భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని అలంకరించారు.

ఈ సందర్భంగా ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ, సనాతన ధర్మ పరిరక్షణలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సమాజంలో ధార్మిక చైతన్యం పెంపొందించేందుకు ట్రస్ట్ చేపడుతున్న సేవలను అభినందించారు. భవిష్యత్తు లో కూడా ఇలాంటి కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమం భక్తి, ఆధ్యాత్మికత, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. అనంతరం నిర్వాహకులు ఎంపీకి సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

# యూనియన్ల ప్రతిపాదన మేరకే అక్రిడేషన్ కమిటీలు

- వెబ్ సైట్ సమస్యలు పరిష్కరిస్తాం
- రామ్ నారాయణ కు హామీ ఇచ్చిన మంత్రి పొంగులేటి
- సమస్యలు పరిష్కరించాలని కోరిన టి యు డబ్ల్యూ జే ఐ జే యు బృందం
- కేబుల్ చానల్స్, చిన్న పత్రికలకు కూడా అక్రిడేషన్లు కల్పించాలని విజ్ఞప్తి



**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 22(తెలంగాణ ముచ్చట్లు )**

జర్నలిస్టు యూనియన్ల ప్రతిపాదన మేరకే అక్రిడేషన్ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జర్నలిస్టుల అక్రిడేషన్, వెబ్ సైట్, కేబుల్ చానల్స్, చిన్న పత్రికల సమస్యలపై మంత్రి పొంగులేటి కి టియుడబ్ల్యూజే ఐజేయు జర్నలిస్టు యూనియన్ నాయకుల బృందం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామ్ నారాయణ సారథ్యంలో ప్రత్యేకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోల రామ్ నారాయణ ఈ సందర్భంగా మంత్రికి అన్ని విభాగాల జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్రంలో 44709 మంది జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇస్తామని చెప్పారని, తమరు ఇచ్చిన జీవో ప్రకారం చూస్తే 50% కార్డులు కూడా రావనే గందరగోళం జర్నలిస్టుల్లో నెలకొందని పేర్కొన్నారు. ఫ్రీలాన్సర్, వెటరన్ జర్నలిస్టులకు పెట్టిన నిబంధనలు ఇబ్బందిగా ఉన్నాయని, వెబ్ సైట్ ఓపెన్ చేస్తే అందులో అడిగే ప్రశ్నలు కార్డులు ఇచ్చేలా లేవని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు మంత్రి దృష్టికి తెచ్చారు. వెబ్సైట్ ఫార్మేట్ సులభతరంగా లేదని ప్రస్తావించారు. జిల్లా అక్రిడేషన్ కమిటీలలో గత సాంప్రదాయం ప్రకారం రిజిస్టర్డ్ యూనియన్ నుంచి లెటర్ పంపితే కమిషనర్ కార్యాలయం ఆమోదించి వారిని కమిటీ లో సభ్యులుగా తీసుకున్నారని, ప్రస్తుతం దానిని పక్కన పెట్టి కలెక్టర్లకు అధికారం కల్పించడానికి తప్పు పట్టారు. ఇది అత్యంత విచారకరమన్నారు. పాత పద్ధతినే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత జీవో ప్రకారం కలెక్టర్ అందరిని నామినేట్ చేస్తారనే ఉందని , ఇది సాధ్యం కాదని, కలెక్టర్కు కొత్త చిక్కులు తెచ్చి పెడుతుందని పేర్కొన్నారు. మా విన్నపాన్ని పరిశీలించి గతంలో అక్రిడేషన్ కమిటీలు ఏ విధంగా ఏర్పాటు చేశారో అదే సాంప్రదాయాన్ని కొనసాగించాలని రామ్ నారాయణ మంత్రిని కోరారు. జీవో ప్రకారం పెద్ద పత్రికలు, శాటిలైట్ చానల్స్, డెస్క్ జర్నలిస్టుల కార్డులు తగ్గించడం జరిగిందని, దీంతో ఇబ్బందులు తప్పవనే ఆందోళనతో జర్నలిస్టులు ఉన్నారని పేర్కొన్నారు. చిన్న పత్రికల వారు కూడా తమకు గతంలో మాదిరిగా కార్డులు రావని ఆందోళనలో ఉన్నారని, కేబుల్ చానల్స్ జర్నలిస్టులకు అన్యాయమే జరుగుతుందని వివరించారు. గతంలో వారు కార్డులు పొందినప్పటికీ , ఈసారి కార్డులు రావని ఆందోళన చెందుతున్నారని 20 నిమిషాల పాటు అన్ని అంశాలపై మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. యూనియన్ల ప్రతిపాదన మేరకే అక్రిడేషన్ కమిటీలు ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. అక్రిడేషన్ వెబ్ సైట్ ను సరళీకరణ చేస్తామన్నారు. అక్రిడేషన్ల గడువు మరో నెల పొడిగింపు జరుగుతుందని, జర్నలిస్టులు, సంఘాల నాయకులు ఆందోళన చెందరాదన్నారు. అర్హులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. మంత్రిని కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే ఐజేయు జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, మాజీ జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, యూనియన్ జిల్లా కార్యదర్శి మైస పాపారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మామిడాల భూపాల్, జర్నలిస్టుల జిల్లా హౌసింగ్ సొసైటీ అధ్యక్షు ధ్యక్షులు మోయినుద్దీన్, జిల్లా కోశాధికారి నాగండ్ల శివ, ఖమ్మం నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, నంచర్ల జనార్ధన చారి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వేగినాటి మాధవ రావు, జిల్లా నాయకులు ఏలూరు వేణుగోపాలరావు తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కోదండరాంను కలిసిన ఫోరం నేతలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఆదివారం కోదండరాంను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఉద్యమకాలంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. అలాగే ఉద్యమకారుల కుటుంబాలకు ఉపాధి, ఆర్థిక భద్రత కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.డాక్టర్ చీమ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ తెలంగాణ సాధనలో తమవంతు పాత్ర పోషించిన ఉద్యమకారులను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో ఫోరం రాష్ట్ర మీడియా కన్వీనర్ దొమ్మటి కిరణ్ కుమార్ రావు, నాయకులు దయానంద్, జగన్, ఆదిలక్ష్మి, నాగజ్యోతి, భూపాల్, భాస్కర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# నాగర్ కర్నూల్లో రజక కుటుంబంపై జరిగిన దాడిని ఖండించిన పంతంగి సమ్మయ్య

**హన్మకొండ,ఫిబ్రవరి22(తెలంగాణ ముచ్చట్లు):**

నాగర్ కర్నూల్లో రజక కుటుంబంపై జరిగిన దాడిని ఉమ్మడి వరంగల్ జిల్లా రజక ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి పంతంగి సమ్మయ్య తీవ్రంగా ఖండించారు. ఇటువంటి అమానుష ఘటనలు సమాజంలో ఉద్రిక్తతలను పెంచే చర్యలని పేర్కొంటూ, దోషులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేంత వరకు తమ మద్దతు కొనసాగుతుందని తెలిపారు. ఈ ఘటనపై జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి నిందితులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు.



ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కఠిన చర్యలతో పాటు బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని, ఆర్థిక సహాయం అందించాలని సమ్మయ్య కోరారు. సమాజంలో శాంతి భద్రతలు పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. రజక సమాజ గౌరవాన్ని కాపాడేందుకు, సామాజిక ఐక్యతను బలోపేతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా నిలవాల్సిన అవసరం ఉందని పంతంగి సమ్మయ్య పేర్కొన్నారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.





# బొగ్గుల శ్రీనివాస్ హత్య కేసును చేదించిన కూసుమంచి పోలీసులు

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 22(తెలంగాణ ముచ్చట్లు)**

రచయిత, యూ ట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ హత్య కేసును ఖమ్మం జిల్లా కూసుమంచి పోలీసులు ఛేదించారు. శ్రీనివాస్ హత్యకు దారి తీసిన పరిస్థితులను, పరిణామాలను ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఆర్థిక లావాదేవీల వివాదమే శ్రీనివాస్ దారుణ హత్యకు దారి తీసినట్లు చెప్పారు. అశ్వరావుపేటకు చెందిన సుపారీ ముఠా శ్రీనివాస్ ను కత్తులతో పొడిచి, ఇనుపరాడ్లతో కొట్టి చంపినట్లు ఏసీపీ తెలిపారు. ఈ హత్యోదంతానికి, పవన్ కళ్యాణ్ పై శ్రీనివాస్ రాసిన పుస్తకానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఏసీపి తిరుపతిరెడ్డి కథనం ప్రకారం.. బొగ్గుల శ్రీనివాస్ హత్యకు దారి తీసిన పూర్తి వివరాల్లోకి వెడితే.. బొగ్గుల శ్రీనివాస్ హైదరాబాద్ లో నివసిస్తూ యూ ట్యూబర్ గా, రచయితగా ప్రాచుర్యం పొందాడు. యూ ట్యూబ్, ఇన్ స్టా గ్రామ్ లలో వీడియోలు చేస్తుండేవాడు. శ్రీనివాస్ తో పాటు మేకల వేణుమాధవ్ రెడ్డి అనే వ్యక్తి సిల్వర్ జూబ్లీ కాలేజీలో చదువుకున్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరైన సందర్భంలో ఒకరికొకరు పరిచయం అయ్యారు. బొగ్గుల శ్రీనివాస్ కు బొగ్గుల బీబీక్ పేరుతో జీఎస్టీ లైసెన్స్ ఉండగా, వేణుమాధవ్ రెడ్డి 'మేకా ప్రాజెక్ట్స్' పేరుతో ఓ కంపెనీని స్థాపించి సబ్ కాంట్రాక్టర్ గా పని చేస్తున్నాడు. బొగ్గుల శ్రీనివాస్ హైదరాబాద్ లో నివసిస్తూ యూ ట్యూబర్ గా, రచయితగా ప్రాచుర్యం పొందాడు. యూ ట్యూబ్, ఇన్ స్టా గ్రామ్ లలో వీడియోలు చేస్తుండేవాడు. శ్రీనివాస్ తో పాటు మేకల వేణుమాధవ్ రెడ్డి అనే వ్యక్తి సిల్వర్ జూబ్లీ కాలేజీలో చదువుకున్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరైన సందర్భంలో ఒకరికొకరు పరిచయం అయ్యారు. బొగ్గుల శ్రీనివాస్ కు బొగ్గుల బీబీక్ పేరుతో జీఎస్టీ లైసెన్స్ ఉండగా, వేణుమాధవ్ రెడ్డి 'మేకా ప్రాజెక్ట్స్' పేరుతో ఓ కంపెనీని స్థాపించి సబ్ కాంట్రాక్టర్ గా పనిచేస్తున్నాడు. అయితే ఇందుకు రూ. కోటి పైనే జీఎస్టీ జరిమానా చెల్లించాల్సిన పరిస్థితుల కారణంగా శ్రీనివాస్, వేణుమాధవ్ రెడ్డిల మధ్య తీవ్ర విభేదాలు, వివాదాలు తలెత్తాయి. ఆర్థిక ఒత్తిడికి బొగ్గుల బీబీక్ కంపెనీ జీఎస్టీ లైసెన్స్ తిరిగి యాక్టివేట్ చేయించడం, కోటి రూపాయల జరిమానా భారం తదితర అంశాలు తోడవడంతో వేణుమాధవ్ రెడ్డి మదిలో హత్య యోచన మెదిలింది. ఈమేరకు కుట్ర పన్నిన వేణుమాధవ్ రెడ్డి అశ్వారావుపేటకు చెందిన పోకల కోటేశ్వర్ రావును, షేక్ అబ్దుల్ హఫీజ్ ను, మహ్మద్ అజ్మత్ ఆలీ ఖాన్ తో కలిసి శ్రీనివాస్ హత్యకు కుట్ర పన్నాడు. కుట్ర అమలులో భాగంగా పోకల వెంకటేశ్వర్ రావు, అబ్దుల్ హపీజ్, ఆజ్మత్ ఆలీఖాన్ ముఠాకు రూ. 5.00 లక్షల మొత్తాన్ని వేణుమాధవ్ రెడ్డి సుపారీగా చెల్లించాడు. చెల్లించాల్సిన డబ్బును ఇస్తామంటూ ఈనెల 13వ తేదీన రాత్రి శ్రీనివాస్ ను ఆయా ముఠాతోపాటు వేణుమాధవ్ రెడ్డి నమ్మించారు. డబ్బుకోసం విజయవాడకు వెడదామని చెప్పి శ్రీనివాస్ ను కారులో తీసుకువెళ్లారు. ఆ మరుసటి రోజు 14వ తేదీన తెల్లవారుజామున నకిరేకల్ నుంచి జనగామ వైపునకు వెళ్లే దారిలో నిర్మానుష్య ప్రదేశంలో నిందితులు కత్తులు, ఐరన్ రాడ్లతో శ్రీనివాస్ తలపై కొట్టి, పొడిచి దారుణంగా హత్య చేశారు. శ్రీనివాస్ ను ఈ విధంగా చంపిన తర్వాత రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు పథకరచన చేశారు. ఇందులో భాగంగానే మృతదేహాన్ని కారులో తీసుకుని పాలేరు రిజర్వాయర్ లోకి పడేసి, అదుపుతప్పిన కారు ప్రమాద ఘటనగా నమ్మించేయత్నం చేశారు. అయితే మొత్తం ఘటనలో ట్విస్ట్ ఏమిటంటే.. కారును రిజర్వాయర్ లోకి తోసేసి ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన సుపారీ ముఠా మాత్రం పోలీసుల దర్యాప్తు నుంచి తప్పించుకోలేకపోవడం. కాగా ఈ కేసును విజయవంతంగా దర్యాప్తు జరిపిన కూసుమంచి సీఐ సంజీవ్, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం ఎస్ఐలు నాగరాజు, సంతోష్, జగదీష్, ప్రొబేషనరీ ఎస్ఐ దివ్యలను ఏసీపీ తిరుపతిరెడ్డి అభినందించారు. అదే విధంగా ఈ కేసులో సహకరించిన శ్రీకాంత్, సతీష్, వినయ్, ఉదయ్, పూర్ణచందర్ రావు, శ్రీశైలం, శ్రీలత, సయ్యద్, శోభన్, సీతారాములు, హోంగార్డు రాంబాబును ఏసీపీ ప్రశంసించారు. నాలుగు టీంలుగా దర్యాప్తును విజయవంతంగా పూర్తిచేసి, నిందితులను అరెస్ట్ చేసిన ఆయా అధికారులకు, సిబ్బందికి రివార్డులను కూడా ఏసీపీ అందించారు.

# మార్చి 31లోగా రాష్ట్ర అవార్డుకు చేనేత కళాకారులు దరఖాస్తు చేసుకోవాలి

- చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు విజయలక్ష్మి

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -22(తెలంగాణ ముచ్చట్లు)**

మార్చి 31లోగా కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు చేనేత కళాకారులు దరఖాస్తు చేసుకోవాలని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు యం. విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కళాకారులకు శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డునకు ఔత్సాహికుల నుండి ధరఖాస్తులు కోరుతుందని, ఈ అవార్డులు చేనేత కళాకారులు, చేనేత డిజైనర్లకు వారి వృత్తిలో నైపుణ్యత, ప్రత్యేకతల ఆధారంగా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అవార్డు గ్రహీతలకు 25 వేల రూపాయల నగదు బహుమతి, చేనేత శాలువ, మెమెంటో, మెరిట్ సర్టిఫికెట్ తో సత్కరించనున్నట్లు, 2025 డిసెంబర్ 31 నాటికి చేనేత కళాకారులకు 30 సంవత్సరాల పైబడి వయస్సు, చేనేత రంగంలో 10 సంవత్సరములకు తగ్గకుండా అనుభవము, చేనేత డిజైనర్లు 25 సంవత్సరముల పైబడి వయస్సు, చేనేత డిజైన్స్ రంగములో 5 సంవత్సరములకు తగ్గకుండా అనుభవము కలిగి ఉండాలని అన్నారు. అర్హతలు కలిగిన ఔత్సాహికులు నిర్ణీత దరఖాస్తు ఫారము నింపి మార్చి 31, 2026 లోగా సహాయ సంచాలకులు, చేనేత, జౌళి శాఖ హన్మకొండ కార్యాలయములో సమర్పించాలని, తదుపరి వచ్చే దరఖాస్తులు స్వీకరించబడవని, మే 15, 2026 లోపు దరఖాస్తుదారుడి ఉత్పత్తిని మగ్గంపై తనిఖీ చేయడం జరుగుతుందని అన్నారు. దరఖాస్తు ఫారం, ఇతర వివరాల కోసం సహాయ సంచాలకులు, చేనేత, జౌళి శాఖ హన్మకొండ కార్యాలయంలో సంప్రదించాలని చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు విజయ లక్ష్మి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ఒంటరితనం ఆధునిక సమాజానికి

# నిశ్శబ్ద మహమ్మారి

- జనసంచారం మధ్య మనసుల వియోగం
- సాంకేతిక అనుసంధానం సంబంధాల బలహీనత
- కుటుంబ వ్యవస్థ మార్పులు, వలసలు భావోద్వేగ ఖాళీలు
- పరిష్కారం వ్యక్తిగతంలోనా? సామూహిక చైతన్యంలోనా?



**డెస్క్, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఆధునిక ప్రపంచం మనిషికి అపారమైన సౌకర్యాలను అందించింది. క్షణాల్లో ప్రపంచంతో అనుసంధానం, వేగవంతమైన రవాణా, అనేక అవకాశాలు ఇవి జీవన విధానాన్ని మార్చేశాయి. కానీ ఈ పురోగతితో పాటు మరో నిశ్శబ్ద సమస్య పెరుగుతోంది ఒంటరితనం. జనసంచారం మధ్య నివసిస్తున్నప్పటికీ మనసుల మధ్య దూరం పెరగడం ఒక విరుద్ధ పరిస్థితి. ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాదు; సమాజ నిర్మాణాన్ని ప్రభావితం చేసే సవాల్. ఒంటరితనం అనేది ఒంటరిగా ఉండటం మాత్రమే కాదు. అది మనసులోని భావాలను పంచుకునే మనిషి లేకపోవడం. మన విజయాలను పంచుకునే, మన బాధలను అర్థం చేసుకునే, మన మాటలను వినే వ్యక్తి లేకపోవడం. వేగవంతమైన జీవనశైలిలో మనుషులు పనిలో మునిగిపోతున్నారు. సమయం విలువైనదిగా మారింది. కానీ సంబంధాలకు కేటాయించే సమయం తగ్గింది. ఈ మార్పు భావోద్వేగ ఖాళీని పెంచుతోంది. సాంకేతిక అనుసంధానం ఈ సమస్యను మరింత సంక్లిష్టం చేస్తోంది. సామాజిక మాధ్యమాల్లో వందలాది పరిచయాలు ఉన్నా, నిజమైన సాన్నిహిత్యం అరుదుగా మారుతోంది. లైకులు, స్పందనలు, సందేశాలు ఇవి తాత్కాలిక సంతృప్తిని ఇస్తాయి. కానీ అవి లోతైన అనుబంధాన్ని ఇవ్వలేవు. వాస్తవ ప్రపంచంలో కూర్చొని మాట్లాడే సంభాషణ, ఒకరిని ఒకరు వినే అలవాటు, అనుభూతులను పంచుకునే సంబంధాలు తగ్గిపోతున్నాయి.

కుటుంబ వ్యవస్థలో వచ్చిన మార్పులు కూడా ఒంటరితనాన్ని పెంచుతున్నాయి. సంయుక్త కుటుంబాల నుంచి చిన్న కుటుంబాల వైపు మార్పు జరిగింది. వృద్ధులు ఒంటరిగా జీవించే పరిస్థితులు పెరిగాయి. ఉద్యోగాల కోసం వలసలు పెరగడంతో కుటుంబ సభ్యులు వేర్వేరు నగరాల్లో, దేశాల్లో స్థిరపడుతున్నారు. భౌతిక దూరం భావోద్వేగ దూరంగా మారుతోంది. పిల్లలు, యువత కూడా డిజిటల్ ప్రపంచంలో ఎక్కువ సమయం గడుపుతూ ప్రత్యక్ష అనుబంధాలకు దూరమవుతున్నారు.

ఒంటరితనం మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆందోళన, నిరాశ, నిస్సహాయత వంటి భావనలు పెరుగుతాయి. దీర్ఘకాలంలో శారీరక ఆరోగ్యానికీ హానికరం. గుండె సంబంధిత వ్యాధులు, నిద్రలేమి వంటి సమస్యలు కూడా ఒంటరితనంతో ముడిపడి ఉంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అందుకే దీనిని నిశ్శబ్ద మహమ్మారి అని పిలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే పరిష్కారం అసాధ్యం కాదు. సంభాషణే మొదటి అడుగు. కుటుంబంతో ప్రతిరోజూ కొంత సమయం గడపడం, స్నేహితులతో ప్రత్యక్షంగా కలవడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి అలవాట్లు బలమైన అనుబంధాలను పెంపొందిస్తాయి. విద్యాసంస్థలు, కార్యాలయాలు మానసిక ఆరోగ్యంపై చర్చలకు వేదికలు కల్పించాలి. ఒంటరితనం గురించి మాట్లాడటం బలహీనత కాదు; అది అవగాహనకు సంకేతం. సమాజ స్థాయిలోనూ చర్యలు అవసరం. వృద్ధుల కోసం సహాయ వేదికలు, యువత కోసం మద్దతు సమూహాలు, సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలు ఇవి అనుబంధాలను పెంచగలవు. మానవ సంబంధాలు బలపడితేనే సమాజం బలపడుతుంది. సాంకేతికతను పూర్తిగా నిరాకరించడం సాధ్యం కాదు; కానీ దాన్ని సమతుల్యంగా వినియోగించడం అవసరం. మొత్తంగా ఒంటరితనం ఆధునిక సమాజానికి పెద్ద సవాల్‌గా మారుతోంది. అభివృద్ధి ఎంత ఉన్నా అనుబంధాలు లేకపోతే జీవితం అసంపూర్ణం. మానవత్వం, సంభాషణ, సహకారం ఇవే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం. మనసుల మధ్య దూరాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత. సంబంధాలను కాపాడుకుంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది. ఒంటరితనాన్ని గుర్తించి, అవగాహనతో ఎదుర్కొంటేనే మన భవిష్యత్తు సమతుల్యంగా ఉంటుంది. కుటుంబ వ్యవస్థలో మార్పులు కూడా ఒంటరితనానికి కారణం. సంయుక్త కుటుంబాల నుంచి చిన్న కుటుంబాల వైపు మార్పు చోటు చేసుకుంది. వృద్ధులు ఒంటరిగా జీవించే పరిస్థితులు పెరిగాయి. ఉద్యోగావకాశాల కోసం వలసలు పెరగడంతో కుటుంబ సభ్యులు వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడుతున్నారు. ఈ మార్పులు భావోద్వేగ దూరాన్ని పెంచుతున్నాయి.

ఒంటరితనం మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఆందోళన, నిరాశ, నిద్రలేమి వంటి సమస్యలు పెరుగుతాయి. దీర్ఘకాలంలో శారీరక ఆరోగ్యానికీ దుష్ప్రభావం కలిగించవచ్చు. అందుకే ఈ సమస్యను వ్యక్తిగతంగా కాకుండా సామాజిక సమస్యగా చూడాల్సిన అవసరం ఉంది.

పరిష్కారం అవగాహనలోనే ఉంది. కుటుంబంతో సమయం గడపడం, స్నేహితులతో ప్రత్యక్షంగా మమేకం కావడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి అలవాట్లు ఒంటరితనాన్ని తగ్గిస్తాయి. పాఠశాలలు, కార్యాలయాలు మానసిక ఆరోగ్యంపై చర్చలను ప్రోత్సహించాలి. సమాజంలో పరస్పర సహకారం పెరగాలి.

మొత్తంగా ఒంటరితనం ఆధునిక సమాజానికి కొత్త సవాల్‌గా మారుతోంది. సాంకేతిక పురోగతి ఎంత ఉన్నా మానవ అనుబంధాలే నిజమైన బలం. మనసుల మధ్య దూరాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత. సంభాషణ, సహనం, అనుబంధం ఇవే ఒంటరితనానికి నిజమైన పరిష్కారం.

## కొచ్చిలో సమగ్ర సిబ్బంది నివాస సముదాయం ప్రారంభం



- కేంద్ర పారిశ్రామిక భద్రతా దళ మహానిర్దేశకుడు ప్రవీర్ రంజన్ చేతుల మీదుగా ఆవిష్కరణ
- ఐదు దశాంశం ఇరవై ఆరు ఎకరాల్లో హరిత ప్రాంగణ నిర్మాణం
- ఆరు వందల యాభై ఐదు మంది సిబ్బందికి కేంద్రీకృత వసతి సదుపాయం

**కొచ్చి, ఫిబ్రవరి 22 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** కేంద్ర పారిశ్రామిక భద్రతా దళ మహానిర్దేశకుడు ప్రవీర్ రంజన్ కొచ్చిలో విమానాశ్రయ భద్రతా విభాగం వద్ద నిర్మించిన సమగ్ర సిబ్బంది నివాస సముదాయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దళానికి చెందిన ఉన్నతాధికారులు, విమానాశ్రయ నిర్వహణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఐదు దశాంశం ఇరవై ఆరు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ సముదాయం సుమారు ఒక లక్ష పది వేల చదరపు అడుగుల నిర్మాణంతో రూపొందించబడింది. సౌరశక్తి వినియోగంతో పాటు విస్తృత వృక్షారోపణ చేపట్టి పర్యావరణ హితంగా ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారు. ఒకే ప్రదేశంలో ఆరు వందల యాభై ఐదు మంది సిబ్బందికి వసతి కల్పించే విధంగా అన్ని ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. సిబ్బంది సంక్షేమం, మౌలిక వసతుల బలోపేతం, భద్రతా సిద్ధత పెంపు లక్ష్యంగా ఈ ప్రాజెక్టు నిర్మించబడినట్లు అధికారులు తెలిపారు. మెరుగైన నివాస వసతులతో దళ సిబ్బంది మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించగలరని పేర్కొన్నారు. దేశ భద్రతలో కీలక పాత్ర పోషిస్తున్న కేంద్ర పారిశ్రామిక భద్రతా దళానికి ఈ సమగ్ర నివాస సముదాయం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.




## పరస్పర గౌరవం లేకుండా

# శాంతి సాధ్యమా?

**డెస్క్, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచం సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, మనసుల మధ్య దూరం పెరుగుతోందన్న భావన తరచూ వ్యక్తమవుతోంది. భిన్న సంస్కృతులు, భిన్న మతాలు, భిన్న ఆలోచనా విధానాలు కలిసి జీవిస్తున్న ఈ యుగంలో శాంతి, అవగాహన విలువలు మరింత కీలకంగా మారాయి. ఈ విలువలను గుర్తు చేస్తూ జరుపుకునే సందర్భమే ప్రపంచ శాంతి, అవగాహన దినం. ఇది కేవలం ఒక గుర్తింపు దినం కాదు; మానవత్వాన్ని ముందుకు పెట్టే సామూహిక సంకల్పం. శాంతి అనేది కేవలం యుద్ధం లేకపోవడం మాత్రమే కాదు. అది మనసుల మధ్య సమన్వయం, పరస్పర గౌరవం, విశ్వాసం. కుటుంబంలో విభేదాలు వచ్చినప్పుడు సంభాషణ ద్వారానే పరిష్కారం సాధ్యమవుతుంది. అదే విధంగా సమాజంలోనూ, దేశాల మధ్యనూ సంభాషణే శాశ్వత మార్గం. అభిప్రాయ భేదాలు సహజం. కానీ వాటిని ద్వేషంగా మార్చకుండా చర్చల ద్వారా పరిష్కరించగలిగితేనే శాంతి నిలుస్తుంది. అవగాహన లేకపోవడం వల్లే అనేక అపోహలు పుట్టుకొస్తాయి. ఒకరి సంస్కృతి, సంప్రదాయాలు, భావజాలం గురించి తెలియకపోవడం వల్లే విభేదాలు పెరుగుతాయి. భిన్నతలను అంగీకరించడం ద్వారా ఐక్యత బలపడుతుంది. పరస్పర గౌరవం పెరిగితే సమాజంలో శాంతి వాతావరణం ఏర్పడుతుంది. సహనం అనేది బలహీనత కాదు; అది సమాజ బలానికి సంకేతం. నేటి ప్రపంచంలో సమాచార ప్రవాహం అపారంగా ఉంది. కానీ సరైన అవగాహన లేకుంటే అదే సమాచారం విభేదాలకు కారణమవుతుంది. తప్పుడు ప్రచారం, అపోహలు, ద్వేష సందేశాలు సమాజాన్ని విభజించే ప్రమాదం ఉంది. అందుకే విమర్శనాత్మక దృక్పథం అవసరం. నిజానిజాలను తెలుసుకునే అలవాటు పెంపొందించాలి. విద్యాసంస్థలు, మీడియా, సామాజిక సంస్థలు శాంతి, అవగాహన విలువలను బలపరచాలి. ప్రపంచ శాంతి, అవగాహన దినం వ్యక్తిగత స్థాయిలోనూ మనకు పాఠం చెబుతుంది. కుటుంబంలో పరస్పర గౌరవం, కార్యాలయంలో సహకారం, సమాజంలో సహనం ఇవి శాంతియుత జీవనానికి అవసరమైన అంశాలు. చిన్నచిన్న చర్యలు కూడా పెద్ద మార్పుకు దారి తీస్తాయి. ఒక సానుకూల మాట, ఒక సహాయ చర్య, ఒక నిజాయితీ సంభాషణ శాంతిని బలపరుస్తాయి. అంతర్జాతీయ స్థాయిలోనూ ఈ విలువలు కీలకం. దేశాల మధ్య ఉద్రిక్తతలు సంభాషణ ద్వారానే తగ్గుతాయి. శాంతి చర్చలు, సహకార ఒప్పందాలు, పరస్పర గౌరవం ప్రపంచ స్థిరత్వానికి పునాది. యుద్ధం తాత్కాలిక పరిష్కారం ఇవ్వవచ్చు; కానీ శాశ్వత శాంతి సంభాషణ ద్వారానే సాధ్యం. యువతలో శాంతి భావన పెంపొందించాల్సిన అవసరం ఉంది. చిన్న వయసులోనే భిన్నతలను గౌరవించడం, సహనం అలవాటు చేసుకోవడం, పరస్పర అవగాహన పెంపొందించుకోవడం వంటి విలువలు నేర్పాలి. భవిష్యత్తు సమాజం యువత చేతుల్లో ఉంది. వారు శాంతి మార్గాన్ని ఎంచుకుంటే ప్రపంచం మరింత సానుకూల దిశగా సాగుతుంది. మొత్తంగా ప్రపంచ శాంతి, అవగాహన దినం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది విభేదాల కంటే సంభాషణ, ద్వేషం కంటే గౌరవం, అనుమానాల కంటే అవగాహన ముఖ్యమైనవి. మానవత్వమే అత్యున్నత విలువ. పరస్పర గౌరవంతో ముందుకు సాగితేనే శాంతియుత సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. శాంతి అనేది ఒక లక్ష్యం కాదు; అది ప్రతి రోజూ ఆచరించాల్సిన జీవన విధానం. అవగాహన లేకపోవడం వల్లే అనేక విభేదాలు తలెత్తుతాయి. ఒకరి సంస్కృతి, సంప్రదాయాలు, భావజాలం గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తే పరస్పర గౌరవం పెరుగుతుంది. భిన్నతలను అంగీకరించడం ద్వారా ఐక్యత బలపడుతుంది. సమాజంలో శాంతి నెలకొనాలంటే సహనం, గౌరవం, పరస్పర విశ్వాసం అవసరం. నేటి ప్రపంచంలో సమాచార ప్రవాహం వేగంగా సాగుతోంది. కానీ సమాచారం మాత్రమే సరిపోదు; సరైన అవగాహన అవసరం. అపోహలు, తప్పుడు ప్రచారం విభేదాలకు దారి తీస్తాయి. అందుకే విమర్శనాత్మక దృక్పథం, నిజానిజాలను తెలుసుకునే ప్రయత్నం అవసరం.

## ఆరోగ్యకర ఆహారం

# శరీరానికి శక్తి, జీవితానికి స్థిరత్వం

- వ్యాయామం, క్రమశిక్షణ రోగనిరోధక శక్తికి ఆధారం
- మానసిక ప్రశాంతత లేకుండా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమా?
- అలవాట్ల మార్పే దీర్ఘకాల ఆరోగ్య రక్షణ



**డెస్క్, ఫిబ్రవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఆధునిక జీవనశైలి వేగం పెరిగిన కొద్దీ ఆరోగ్య సమస్యలు కూడా పెరుగుతున్నాయి. పనిభారం, ఒత్తిడి, సమయాభావం, అసమతుల ఆహారం, కూర్చునే అలవాట్లు ఇవి శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆరోగ్యకర జీవనశైలి ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ జరుపుకునే సందర్భమే ప్రపంచ ఆరోగ్యకర జీవనశైలి అవగాహన దినం. ఇది కేవలం ఒక గుర్తింపు దినం మాత్రమే కాదు; మన జీవన విధానాన్ని పునఃపరిశీలించుకునే అవకాశం.

ఆరోగ్యకర ఆహారం జీవన నాణ్యతకు పునాది. సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. అధిక కొవ్వు, అధిక చక్కెర, అధిక ఉప్పు ఉన్న ఆహారాల వినియోగం పెరగడం వల్ల మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, రక్తపోటు వంటి సమస్యలు పెరుగుతున్నాయి. అందుకే పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, ప్రోటీన్ సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవడం అవసరం. తాత్కాలిక రుచికన్నా దీర్ఘకాల ఆరోగ్యాన్ని ప్రాధాన్యంగా చూడాలి. వ్యాయామం శారీరక దృఢత్వానికి కీలకం. ప్రతిరోజూ కనీసం కొంత సమయం నడక, యోగా, క్రీడలు లేదా ఇతర శారీరక కార్యకలాపాలకు కేటాయిస్తే శరీరం చురుకుగా ఉంటుంది. కూర్చునే జీవనశైలి అనేక వ్యాధులకు కారణమవుతోంది. క్రమమైన వ్యాయామం రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీర బరువును నియంత్రిస్తుంది. మానసిక ఉల్లాసాన్ని కూడా పెంచుతుంది. మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు ఆధునిక జీవనంలో సాధారణమయ్యాయి. ధ్యానం, విశ్రాంతి, కుటుంబంతో సమయం గడపడం, ప్రకృతితో మమేకం కావడం వంటి అలవాట్లు మానసిక ప్రశాంతతను అందిస్తాయి. మానసిక ప్రశాంతత లేకుండా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం కాదు. శరీరం, మనసు రెండూ సమతుల్యంగా ఉండాలి.

ఆరోగ్యకర జీవనశైలి అనేది ఒక్కరోజులో సాధ్యమయ్యే మార్పు కాదు. అది క్రమశిక్షణతో కూడిన అలవాట్ల మార్పు. ఉదయం సమయానికి లేవడం, సమయపాలన, సమతుల ఆహారం, క్రమమైన వ్యాయామం, సరైన నిద్ర ఇవి జీవన విధానంలో భాగం కావాలి. చిన్నచిన్న మార్పులు కూడా దీర్ఘకాలంలో పెద్ద ఫలితాలను ఇస్తాయి.

నిరోధమే ఉత్తమ చికిత్స అనే భావన ఈ దినం ప్రధాన సందేశం. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్సకంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఆరోగ్యంపై పెట్టే సమయం, శ్రమ భవిష్యత్తులో లాభదాయకం. ఆరోగ్యకర జీవనశైలి పాటించడం ద్వారా వైద్య ఖర్చులు తగ్గుతాయి. జీవన నాణ్యత మెరుగుపడుతుంది. సమాజ స్థాయిలోనూ ఆరోగ్య అవగాహన అవసరం. పాఠశాలల్లో ఆరోగ్య విద్య, కార్యాలయాల్లో ఆరోగ్య కార్యక్రమాలు, సమాజంలో పరిశుభ్రతపై చైతన్యం ఇవి సమిష్టి ఆరోగ్యానికి దోహదపడతాయి. ఆరోగ్యంగా ఉన్న ప్రజలే దేశ అభివృద్ధికి బలమైన పునాది. మొత్తంగా ప్రపంచ ఆరోగ్యకర జీవనశైలి అవగాహన దినం మనకు ఒక స్పష్టమైన పిలుపు ఇస్తుంది ఆరోగ్యమే నిజమైన సంపద. మంచి ఆహారం, క్రమమైన వ్యాయామం, మానసిక ప్రశాంతతను అలవాటు చేసుకుంటే జీవితం సంతోషకరంగా మారుతుంది. అలవాట్లలో మార్పే ఆరోగ్య భద్రతకు మార్గం. వ్యక్తిగత ఆరోగ్యం బలపడితేనే సమాజం బలపడుతుంది. మానసిక ప్రశాంతత కూడా సమగ్ర ఆరోగ్యానికి అవసరం. ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ధ్యానం, విశ్రాంతి, కుటుంబంతో సమయం గడపడం వంటి అలవాట్లు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో, మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం.

ఆరోగ్యకర జీవనశైలి అనేది ఒక్కరోజులో సాధ్యమయ్యేది కాదు. అది అలవాట్ల మార్పుతో సాధ్యమవుతుంది. చిన్నచిన్న మార్పులు పెద్ద ఫలితాలు ఇస్తాయి. ఉదయం త్వరగా లేవడం, సమయపాలన, సమతుల ఆహారం, నియమిత వ్యాయామం ఇవి జీవితంలో శాశ్వత మార్పుకు దారి తీస్తాయి. ప్రపంచ ఆరోగ్యకర జీవనశైలి అవగాహన దినం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది——నిరోధమే ఉత్తమ చికిత్స. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స కంటే, ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఆరోగ్యంపై పెట్టే సమయం, శ్రమ భవిష్యత్తులో లాభదాయకం. మొత్తంగా ఆరోగ్యకర జీవనశైలి వ్యక్తిగతంగానే కాక సమాజానికి కూడా అవసరం. ఆరోగ్యంగా ఉన్న ప్రజలే అభివృద్ధికి బలమైన పునాది. మంచి ఆహారం, వ్యాయామం, మానసిక ప్రశాంతతను అలవాటు చేసుకోవడం ద్వారా మన జీవితం సంతోషకరంగా మారుతుంది. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సత్యాన్ని గుర్తుచేసే సందర్భమే ఈ దినం.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నిరాశపర్చిన రాజాసాబ్.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి ప్రభాస్ మరో ఛాన్స్..!




గ్లోబల్ స్టార్ ప్రభాస్ ఇటీవల 'ది రాజా సాబ్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. టాలీవుడ్‌లో ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ చిత్రం భారీ అంచనాల మధ్య విడుదలైనప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధించలేకపోయింది. దీంతో ఈ సినిమా ఆ సంస్థకు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోయిందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఇదిలా ఉండగా, ప్రభాస్ మరోసారి అదే బ్యానర్‌తో సినిమా చేసేందుకు సిద్ధమవుతున్నాడనే వార్తలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 'ది రాజా సాబ్' ఫలితం ఆశించినట్లు రాకపోయినా, నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌కు ప్రభాస్ మరో ప్రాజెక్ట్ చేస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. బాక్సాఫీస్ ఫలితాలను పక్కనబెట్టి నిర్మాతకు అండగా నిలవాలనే నిర్ణయం తీసుకోవడం ప్రభాస్ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తోందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రభాస్ - పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కలయికలో రాబోయే ఈ కొత్త ప్రాజెక్ట్‌పై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని సమాచారం. అయితే ఈ చిత్రానికి దర్శకత్వం వహించబోయే దర్శకుడు ఎవరు? కథా నేపథ్యం ఎలా ఉండబోతోంది? అనే విషయాలపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రభాస్ స్టార్‌డమ్‌కు తగ్గట్టుగా, అభిమానులను ఆకట్టుకునే స్థాయిలో ఈ చిత్రం ఉండాలని సినీ ప్రియులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ ఖాతాలో 'సలార్ 2', 'ఫౌజీ', 'స్పిరిట్' వంటి భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో మళ్లీ కలిసే సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందన్నదానిపై ఆసక్తి నెలకొంది. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

# ఉస్తాద్ భగత్‌సింగ్‌లో ఉస్తాద్ ఔరా పాట సంచలనం..




పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ నటిస్తున్న భారీ చిత్రమైన ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి విడుదలైన "ఉస్తాద్ ఔరా" పూర్తి గీతం అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. దర్శకుడు హరీష్ శంకర్ రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. గీతం విడుదలైన వెంటనే సామాజిక మాధ్యమాల్లో వేగంగా వ్యాప్తి చెందుతూ ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది.

"నేను మెడ ముట్టుకుంటే తొడగొట్టినట్టే... జుట్టు ఎగురుతుంటే పిడుగులు పడినట్టే..." అంటూ ప్రారంభమయ్యే ఈ గీతంలో పవన్ కల్యాణ్ ప్రత్యేక శైలి స్పష్టంగా కనిపిస్తోంది. అభిమానులు ఆశించే శక్తివంతమైన నృత్య కదలికలు, ఉత్సాహభరితమైన భావ వ్యక్తీకరణలు ఈ గీతాన్ని మరింత ఆకర్షణీయంగా నిలబెట్టాయి. గీత రచయిత చంద్రబోస్ రాసిన పదాలు సామూహిక ఉత్సాహాన్ని రగిలించేలా ఉన్నాయి. సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ స్వరపరిచిన ఈ గీతాన్ని ఆయన బృందం ఆలపించడం విశేషం. ఈ చిత్రంలో కథానాయికగా శ్రీలీల నటిస్తుండగా, కీలక పాత్రలో రాశీ ఖన్నా కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన మొదటి గీతం కూడా ప్రేక్షకాదరణ పొందగా, తాజాగా వచ్చిన "ఉస్తాద్ ఔరా" గీతం చిత్రంపై అంచనాలను మరింత పెంచింది.

గ్లింప్స్‌లో మహంకాళి పోలీస్‌స్టేషన్ నేపథ్యంలో పవన్ కల్యాణ్ పలికిన సంభాషణలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన గబ్బర్ సింగ్ భారీ విజయాన్ని సాధించడంతో, ఈసారి కూడా అదే స్థాయి విజయం సాధిస్తుందనే నమ్మకం అభిమానుల్లో కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని మార్చి 26న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

# మా ఇంటి బంగారం విడుదల తేదీ ఖరారు




స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రం విడుదల తేదీ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని మే 15న వేసవి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

సుదీర్ఘ విరామం తర్వాత సమంత తెలుగులో నటిస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో ఆమె మధ్యతరగతి గృహిణి పాత్రలో కనిపించడమే కాకుండా, ఆకట్టుకునే యాక్షన్ సన్నివేశాల్లోనూ నటిస్తున్నట్లు సమాచారం. గతంలో 'ఓ బేబీ'తో విజయం సాధించిన నందిని రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సమంత తన స్వంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

కథను రాజ్ నిడిమోరు అందించగా, సంగీతాన్ని సంతోష్ నారాయణన్ సమకూరుస్తున్నారు. గుల్షన్ దేవయ్య, దిగంత్, గౌతమి, శ్రీముఖి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సమంత తన సామాజిక మాధ్యమ వేదికలో కొత్త పోస్టర్‌ను పంచుకుంటూ "యాక్షన్‌తో నిండిన గోల్డెన్ హంట్ - ఈ వేసవిలో థియేటర్లలో కలుద్దాం" అని పేర్కొనడంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. వేసవి సెలవులను లక్ష్యంగా చేసుకుని వస్తున్న ఈ చిత్రం సమంత కెరీర్‌లో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.



# ఫిలింఫేర్ అవార్డు బెస్ట్ డెబ్యూ హీరోయిన్..

టాలీవుడ్‌లో కొత్త ముద్దుగుమ్మల హవా స్పష్టంగా కనిపిస్తోంది. యంగ్ హీరోలు కొత్త హీరోయిన్స్‌తో సినిమాలు చేయడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్న వేళ, తక్కువ కాలంలోనే మూడు విజయాలను అందుకుని అందరి దృష్టిని ఆకర్షించిన నటి నయన్ సారిక. తాజాగా ఆమె ఫిలింఫేర్ అవార్డ్స్‌లో ఉత్తమ తొలి నటి పురస్కారం అందుకోవడం ద్వారా మరింత చర్చనీయాంశమైంది.

నయన్ సారిక సినీ ప్రయాణం ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన 'గం గం గణేషా' చిత్రంతో ప్రారంభమైంది. తొలి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ యువ నటి, ఆ తర్వాత నార్ని నితిన్ నటించిన 'ఆయ్' చిత్రంలో నటించి మరో విజయాన్ని అందుకుంది. నటన పరంగా మంచి మార్కులు సాధించిన ఆమె, సహజమైన అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.

'ఆయ్' తర్వాత కిరణ్ అబ్బవరం హీరోగా తెరకెక్కిన 'క' చిత్రంలో కూడా నయన్ సారిక కీలక పాత్ర పోషించింది. విభిన్న కథాంశంతో రూపొందిన ఈ సినిమా విజయవంతం కావడంతో ఆమెకు వరుస విజయాలు దక్కాయి. మూడు సినిమాలు విజయవంతం కావడంతో నయన్ సారికను పరిశ్రమలో లక్కీ హీరోయిన్‌గా అభివర్ణిస్తున్నారు.

ప్రస్తుతం ఈ అందాల భామ చేతిలో మరికొన్ని ఆసక్తికర ప్రాజెక్టులు ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, తాజా ఫిలింఫేర్ అవార్డ్స్‌లో ఉత్తమ తొలి నటి విభాగంలో అవార్డు అందుకోవడం ఆమె కెరీర్‌కు మరింత బలాన్నిచ్చింది. తక్కువ సమయంలోనే మంచి విజయాలు, అవార్డు దక్కించుకోవడం విశేషంగా చెప్పుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో పెద్దగా చురుకుగా లేకపోయినా, అప్పుడప్పుడూ తన ఫొటోలతో అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా ఆమె ఫొటోలు నెట్టింట వైరల్ అవుతుండగా, అభిమానులు అభినందనల వర్షం కురిపిస్తున్నారు. వరుస విజయాలతో ముందుకు సాగుతున్న నయన్ సారిక భవిష్యత్తులో టాలీవుడ్‌లో మరింత స్థిరపడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in